# తప్పు - శిక్ష

ఆరోజుల్లో ఆర్రూపాయల రోజు కూలీగా పంజేసిన వెంకట్రావు ఈ రోజుల్లో నెలకు ఆరు వేల రూపాయల నగదు జీతం పుచ్చుకుంటున్న సూపర్వైజరు.

శ్రమయేవ జయతే అతని సిద్ధాంతం. అనవసరమైన రాద్ధాంతాల జోలికి పోకుండా, తన పని తాను నిజాయితీగా చేసుకుంటూ, నలుగురితో కలివిడిగా మెదుల్తూంటే నాకం భూలోకానికి దిగి వస్తుందని తాను నమ్మి ఇతరులకు చెబుతుంటాడు. జీవన యానములో అనుభవాలు నేర్పిన పాఠాలు జ్ఞాపకాల పొరల్లో నిక్షిప్తమైపోయినై.

ఇంకో సంవత్సర మిలాగే సాగిపోతే రిటైరై పోవచ్చు. కృష్ణా రామా అంటూ శేషజీవితం సమాజసేవలో గడిపెయ్యొచ్చు.

సెలవు రోరజున పడక్కుర్చీలో కూచోగానే దృక్కులు శూన్యంలోకి చొచ్చుకుపోయినై. ఎద తెరమీద కొడుకు రామచంద్రం ప్రత్యక్షమయాడు. కులము నుద్ధరించు కొడుకొక్కడే చాలు అన్నారుగదా ! పిచ్చి సన్నాసి... ఆరోజు చిరుద్యోగం చెయ్యనని ఎంత చిటపటలాడాడు !

"ముష్టి మూడువేల రూపాయల జీతంతో ముప్పై రోజులు ముప్పూటలు గడపాలంటే ఎలా వీలవుతుంది నాన్నా ?" అమాయంకంగా ప్రశ్నించాడు.

"మూడు వేలేమిట్రా ! మూడొందలతో గూడా బతకొచ్చు !" అనేశాడు తను.

"అంటే... రోజుకొక్కపూట తింటూనా లేక పూటకొక్క మెతుకు తింటూనా ?"

అది అత్యాశనో, అపహాస్యమో అంతుబట్టలేదు.

"కాదు. ముప్పూటలా తింటూ మురిపాల పంట పండించుకోవచ్చు. మనిషి బతికేందుకు తింటున్నాడు గాని తినేందుకు మాత్రమే బతకడం లేదుగదా !"

"ఇది మెట్ట వేదాంతం నాన్నా !"

"కాదు. గట్టివారు చెప్పిన అనుభవ సారము"

తండ్రీకొడుకుల తమాషా వాదులాట వింటూంటే ఇంటి ఇల్లాలు ఈశ్వరమ్మకు ఒంటిమీద గండు చీమలు పాకినట్టనపించిందేమో ...

"ఒరేయ్ రాముడూ ! మీ నాన్న ఆర్రూపాయల కూలీగా చేరి స్వయంకృషితో పైకొచ్చాడు తెల్సా !" గుర్తు చేసింది.

"అలాగా !" నోరెల్ల బెట్టాడా అర్భకుడు.

"అవున్రా ! సంవత్సరం తిరిగే లోగా నెలజీతం ఉద్యోగయాడు. ప్రతినెలా జీతం లోంచి కొంత మిగిలిస్తూ కూడబెట్టిన డబ్బుతో ఆటో కొనేశాడు. ఆటో కొన్నానాడే నువ్వు పుట్టావు. ఆటోతో

మరికొంత ఆదాయమొచ్చింది. నీ చెల్లి పుట్టింతర్వాత మీనాన్న ఐ.టి.ఐ. పూర్తైంది. అప్పుడు అద్దెకొంప. ఇప్పుడు సొంతిల్లు, చెల్లి పెళ్లైంది, నీకుద్యోగం దొరికింది, బుద్ధిమంతుడిలా వెళ్లి ఉద్యోగం చేసుకో..." హితవు చెప్పింది.

"అయితే... జీవితమంటే అంతేనామ్మా ?" దీర్ఘాలుదీశాడు.

"మరింకేమిట్రా ?" బుగ్గలు నొక్కుకుంది.

"బొటాబొటి జీతంతో బతుకునీడ్వడములో థ్రిల్లేముందమ్మా ?" మారాము చేశాడు.

"థ్రిల్లూ, గిల్లూ జాన్తానై" తనందుకున్నాడు. "నాలుగురాళ్లు సంపాదిస్తూ నలుగురిలో తలెత్తుకు బతకడమే గొప్ప తృప్తి. ఆశాపాశాని కంతులేదురా. ఇంతకీ నువ్వు ఉద్యోగానికెల్తున్నావా లేదా ?" నిలదీసి సూటిగా అడగడం మంచిదైంది.

పెట్టెబేడా సర్దుకుని మర్నాడే వెళ్లిపోయి ఉద్యోగములో జాయినయాడు. మొదటి సంవత్సరం ముద్దుగా గడిచింది. రెండో సంవత్సరం పెళ్లైంది. మూడో సంవత్సరం ముద్దుల మనవడు... అవునూ... మనవడిప్పుడేం చేస్తున్నాడో... చిన్నికృష్ణుడిలా ఇల్లంతా గంతులేస్తున్నాడేమో ! వాళ్లమ్మ ఒడిలో అల్లరి చేస్తున్నాడేమో !...

"ఏవిటో... అయ్యగారు అంతసుదీర్ఘంగా ఆలోచిస్తున్నారు !" ఈశ్వరమ్మ పలుకరింపు ఈ లోకంలోకి లాక్కొచ్చింది.

"ఇదిగో ఛాయ !" వేడిగ్లాసు అందించింది. మరో గ్లాసు టీపాయ్ మీదుంచి ఎదురు కుర్చీలో కూచుంది. నన్నని రేఖలు చోటుచేసుకున్న ఈశ్వరమ్మ నుదుటి మీద ముంగురులాడుకుంటున్నై. ఎడమ చేత్తో వాటిని సవరించుకుంటూ కుడిచేత్తో చాయ గ్లాసందుకుంది.

"ఏమాలోచిస్తున్నారు ?" కళ్లలోకి సూటిగా చూసింది. తెల్లని ముక్కుపుడక తళుక్కు ఎర్రని కుంకుమబొట్టు చెమ్మక్కులో లీనమై మొహాన్ని త్రివర్ణ చిత్రంగా మార్చేసింది.

"ఆలోచించేందుకేముంటుందిప్పుడు? మనమ్మాయి దాని పిల్లలు, మనబ్బాయి - వాని కొడుకు ఎలాగున్నారో ఏంచేస్తున్నారోననీ..."

"వాళ్లకేమండీ... దర్జాగా ఉంటారు. అయినా... వాళ్లను గురించి మనమాలోచించడమే గాని మన గురించి వాళ్లేమన్నా ఆలోచిస్తున్నారంటారా !"

"తప్పకుండా ... వాళ్లు నా పిల్లలోయ్ !"

ఈశ్వరమ్మ కిలుక్కుమంది.

"పోస్ట్... పోస్ట్ సార్ ...!" పోస్ట్‌మేన్ కేక.

ఈశ్వరమ్మ వెళ్లి ఇన్‌లాండ్ లెటర్ అందుకుంది. ఫ్రం అడ్రసు చూసి "మనబ్బాయి నుండే. మనమిట్లా గుర్తు చేస్తూన్నామో లేదో అట్లా వానుత్తరమొచ్చింది. చదవండి" ఉత్తర మందించి కూచుంది.

"పూజ్యులైన నాన్నగార్కి... నమస్కారములు. నేనొక ఆపదలో చిక్కుకున్నాను. మీరు వెంటనే రావాలి..."

"ఆపదనా..." ఈశ్వరమ్మ గుండెల్లో గూడ్సురైలు పరుగెత్తింది. "ఇంకేం రాశాడండీ ?" అడిగింది ఆదుర్దాగా.

"ఇంకేమీ రాయలేదు... " దరిలేని బావిలో ఉన్నట్టనిపించింది.

ఏం ఆపద ముంచుకొచ్చిందో ! వెధవ ! వివరాలేమీ రాయలేదే... మనసు మూల్గింది. పైకి మాత్రం గంభీరంగా ఉన్నాడు.

"ఆఁ... ఏమైందోలే ! నేను వెళ్లొస్తా. ఫ్యాక్టరీలో లీవు లెటరిచ్చి అట్నుంచటే వెళ్తా..." లేచి తయారవుతున్నాడు.

ఈశ్వరమ్మ మొహము వాడిపోయిన వంకాయలాగైంది. నాబాబు ! ఎంత బాధపడి పోతున్నాడో... అంతరంగములో ఆందోళన సుడులు తిరుగుతోంది.

"నేను గూడా వస్తానండీ... అంటూ సూటుకేసు సర్దేసి బయలుదేరింది.

ఇలా ఉత్తరం రాయగానే అలా వచ్చివాలిన తల్లిదండ్రులు పార్వతీ పరమేశ్వరుల్లా కన్పించారు రామచంద్రంకు. ఉక్కిరి బిక్కిరయాడో క్షణం. ...మా అమ్మ అమృతభాండం ! నాన్న మనసు చల్లని వెన్నెల... గొణుక్కున్నాడు. ఎదురెళ్లి సూటుకేసందుకున్నాడు.

కోడలు సుకుమారి అందించిన చాయగ్లాసులందుకున్నారు పెద్దవాళ్లు. ముద్దుల మనవడు నానమ్మ కాళ్లను చుట్టేశాడు.

"ఏమైందిరా రాముడూ?" మనవణ్ని ముద్దాడుతూ తండ్రీ కొడుకులవైపు చూసింది ఈశ్వరమ్మ.

"అదీ... అ...ది... ఏందం...టే.." నీళ్లు నమిలాడు రామచంద్రం.

కొడుకేదో కొంపముంచే పనిచేసుంటాడనే అనుమానమొచ్చింది తండ్రికి. చూపులు ఇల్లంతా తడుముతున్నై.

రంగుల టీ.వి. రాగాలు పలుకుతోంది.

వీ.సీ.ఆర్, సోఫాసెట్టు... ఇవన్నీ ఎప్పుడు ఎలా కొన్నాడో... మెదడు పొరల్లో చింపిరి ఆలోచనలు.

"అసలేమైందిరా ?" తల్లి మనసు అతలాకుతలమవుతోంది.

"అదీ... అది..." రెండు చేతుల్లో మొహం దాచుకున్నాడు రామచంద్రం.

"తాతయ్యా ...!" ఈశ్వరమ్మ ఒళ్లోంచి జారి వెంకట్రావు వైపు తిరిగాడు బుడిబుడి నడకల బుజ్జిగాడు. మనవణ్ని గుండెలకు హత్తుకున్నాడు. అనిర్వచనీయమైన హాయి... ఎంతో సంతోషం...

"చెప్పు రాముడూ !" వెంకట్రావే అడిగాడు.

రామచంద్రం బెరుకు చూపులు సుకుమారి వైపు మళ్లినై. నేరం చేస్తూ పట్టుబడ్డట్టు ఆ చూపుల్లో నిర్మలత్వం లేదు. వెంకట్రావు దంపతులకు ఓపిక నశించింది.

"నువ్వన్నా చెప్పమ్మా ఏమైందో..." కోడలు నడిగింది ఈశ్వరమ్మ.

"ఫ్యాక్టరీ ఆఫీసులో ఏదో గొడవైందటత్తయ్యా !" సుకుమారి చూపులు నేలమీదున్నై.

"ఫ్యాక్టరీ ఆఫీసులో గొడవనా... ఆఫీసు డబ్బేమన్నా కాజేశాడా ?" వెంకట్రావుకు ఒళ్లు మండింది.

"కాదు మావయ్యా ! వర్కర్ల డబ్బులూ..." ఇహ చెప్పలేక పోయింది.

"వర్కర్ల డబ్బులు వీడెట్లా మాయంజేస్తాడమ్మా ? బిల్లుమీద సంతకాలు తీసుకుని ఏనెల కానెల జీతాలు పంచుతున్నాడు గదా !"

"అదే... జీతాల్లో కోతలూ..."

"జీతాల్లో కోతలు పెట్టేందుకు వీడెవడమ్మా ? ఉద్యోగుల కెంత జీతమివ్వాలి, ఏయే డిడక్షన్స్ చెయ్యాలి అనేది నిర్ణయించేది యాజమాన్యం గదా !" విషయం అర్థంగాక విషం మింగుతున్నట్టుంది.

"అదేమామయ్యా ... వర్కర్ల జీతాల్లోంచి తన కోసం కొంత మినహాయించుకుని పంచేస్తున్నారటా ..."

ఇప్పుడర్థమైంది.

"అం...టే... లంచాలకు మరిగాడన్నమాట..."

అప్పుడే వికసించిన పూవులా ఎప్పుడూ కళకళలాడే సుకుమారి మొహం కళావిహీనమైంది.

"అదే.. అంతే అనుకోండి. వర్కర్లంతా మానేజర్‌కు కంప్లైంటు చేశారట. మానేజర్ ఈయన్ని దబాయించి అడిగారట. అక్కడేమో సస్పెన్షనార్డర్ తయారౌతుందటా. రాతపూర్వకంగా జవాబివ్వమంటే ఇంకా ఇవ్వలేదు..." తలవంచుకుని పక్కకు జరిగింది.

నట్టింటిలో నాటుబాంబు పేలినట్టనిపించింది వెంకట్రావుకు.

"ఓరి దుర్మార్గుడా !" ఆవేశాన్నాపుకోలేక పోయాడు. "వర్కర్ల కడుపుగొట్టి కమ్మగా పుల్లగా తింటున్నావా ! నిన్నూ..." కొరికి పారెయ్యాలన్నంత కోపమొచ్చి గబుక్కు లేవబోయాడు. భుజాలు పట్టి ఆపేసింది భార్య.

రంగులకల చెదిరిపోతున్నట్టనిపించింది రామచంద్రంకు. రోషం పొడుచుకొచ్చింది.

"అదికాదు నాన్నా !" రోషిన తల పైకిలేచింది. "వందల కొద్దీ వర్కర్ల జీతాల బిల్లులు తయారు చేస్తున్నాను. బ్యాంకు నుండి క్యాషు డ్రా చేసుకొస్తున్నాను. జీతాల రోజున మధ్యాహ్న భోజనాన్ని గూడా మరిచి అందరికీ జీతాలు పంచుతున్నాను. ఇంత కష్టపడినందుకు, అంత రిస్క్ తీసుకున్నందుకు తలా ఓ ఇరవై రూపాయలిస్తున్నారు... తప్పా ?"

ఒళ్లంతా గాట్లుపెట్టి కారప్పొడి చల్లినట్టైంది వెంకట్రావుకు. "వాళ్లిస్తున్నారనకు. నువ్వే కోసేస్తున్నావ్. అది మామూలు తప్పుకాదు... నేరం గూడా".

"అదెలా నాన్నా ?"

"నీకు నెలజీతమిస్తుంది ఆపనులకే. అకౌంటెంట్ కమ్ క్యాషియర్‌కు అవే పనులుంవి. నీ డ్యూటీ నువ్వు చేస్తున్నందుకు మామూలు... నెల మామూలు వసూలు చేస్తున్నావా !... ఛీ... నా కడుపున చెడబుట్టావురా !" దిగ్గున లేచాడు.

రామచంద్రం రోషం రంకెలేసింది. మొహంలో రంగులు మారినై.

"పోనాన్నా ! నీదో సోది. అలా చెయ్యకపోతే గొర్రెతోక జీతంతో సరదాలు తీరుతాయా? భార్యాపిల్లాడితో నెలకో నాల్గుసిన్మాలన్నా చూడగల్గుతానా ...!"

"శక్తికి మించిన విలాసాలకు అలవాటుపడితే శనిదేవుడు నెత్తిమీదికొస్తాడు..."

"చాల్చాలు నాన్నా ! నువ్వొచ్చి వర్కర్లందరికీ నచ్చజెబుతావనుకుంటే..." మాట పూర్తి కాలేదింకా. చెంపలు ఛెళ్లు ఛెళ్లుమన్నై.

"నీతి నిజాయితీలు లోపించేకొద్దీ మనిషిలో రాక్షసత్వం బలపడుతుంటుంది. తెలుసుకోరా ..." తనను తాను సంభాళించుకోలేక పోతున్న వెంకట్రావును అత్తాకోడళ్లు చెరోచెయ్యి బట్టి లాక్కొచ్చి కూచోబెట్టారు.

"దయచేసి శాంతించండి మావయ్యా..." సుకుమారి బతిమాలింది.

తల్లి హృదయం తల్లడిల్లింది.

"ఇదేమిటండీ... చెట్టంత కొడుకును పట్టుకుని చెంపలు వాయిస్తారా !" బాధ, కోపం కరిగి కళ్లల్లో బిందువులై చెంపలమీద రాలిపడున్నై.

ఇలా జరుగుతుందని ఊహించలేదు రామచంద్రం.

పుట్టి బుద్దెరిగినప్పట్నుంచీ నామీద ఈగవాలనివ్వని నాన్న ఇలా ప్రవర్తించాడంటే... నాది క్షమించరాని నేరమే" నరాల్లో సత్తువ మాయమైంది. చెంపల్ని అరచేతుల్తో కప్పుకుని కూలబడి పోయాడు.

"ఒరే రాముడూ!" కొంగుతో కళ్లద్దుకుంది ఈశ్వరమ్మ "నువ్వు తప్పుచేశావురా. నీ జీతం నీకు పరిపోదంటున్నావు గాని... నీ కంటె తక్కువ జీతం పొందుతున్న వరక్కర్ల జీతాల్లో కోతపెట్టే ముందు వాళ్ల భార్యల గుండెకోత గురించి ఆలోచించావా ? మితిమీరిన ఆడంబరం ఆపదలకు హేతువు. సస్పెండైతే, ఆ తర్వాత ఉద్యోగం ఊడిపోతే నీ పరిస్థితి ఏమిటో ఊహించుకో' కొడుకు తలను ఒళ్లోకి చేర్చుకుంది.

రామచంద్రం బుర్రలో భూగోళం తిరిగింది. తలలో తైతక్కలాడిన జేజమ్మ పారిపోయింది.

"అమ్మో ... ఉద్యోగం ఊడిపోతే బతుకు బజారు పాలవుతుంది నాన్నా !" లేచివెళ్లి తండ్రి పాదాలందుకున్నాడు. "ఈసారిలాంటి తప్పులు చెయ్యను నాన్నా ?" లెంపలేసుకున్నాడు. వెంకట్రావుకు కడుపులో దేవినట్లైంది.

"మనం వెళ్లి మాట్లాడ్దాం పదా ! " అని కొడుకును వెంటబెట్టుకెళ్లాడు.

కార్మికుల చెమటవాసనతో పావనమైన ఫ్యాక్టరీ మిషన్లు చకచకాసాగిపోతున్నై. పనివారల ఉచ్ఛ్వాస నిశ్వాసలు పనిముట్లను పులకింపజేస్తున్నై.

"మీరా... మీ..రు..." ఒకనాటి కోవర్కరీనాడు మానేజర్ సీట్లో కన్పించేసరికి వెంకట్రావు నోటిమాట ఆగిపోయింది.

"నేనూ... నేనేరా !" మానేజర్ లేచినుంచున్నాడు. "ఒరేయ్ వెంకట్రావ్ ! నువ్వు... ఇక్కడిలా..." సాదరంగా ఆహ్వానించాడు.

ముప్ఫైమూడేళ్ల క్రితం ఒకే ఫ్యాక్టరీలో ఇద్దరు ఒకే రోజు వర్కర్స్‌గా చేరడం, ప్రతికూల వాతావరణములో పట్టుదలగా పంజేసి ఉత్పత్తి పెంచిన తీరు, రాత్రంతా ఫ్యాక్టరీలో పంజేస్తూ రోజంతా ఐ.టి.ఐ. క్లాసుల కెళ్లడం... ఎన్నో విషయాలు ముచ్చటించుకున్నారు.

ఆ సంభాషణ వింటూంటే రామచంద్రం తల సిగ్గుతో వంగిపోయింది. మురికి నీటి బిందెలో చిల్లగింజ గంధం వేసినట్టు - మానసిక సంఘర్షణ ఓ కొలిక్కి వచ్చింది.

"దాయాదులకేసులోనెగ్గి వచ్చిన డబ్బుతో నువ్వో ఫ్యాక్టరీ ప్రారంభించి ఈ రోజింత పెద్ద ఫ్యాక్టరీకి మానేజింగ్ పార్ట్నర్‌వయావంటే నా కెంతో సంతోషంగా ఉందిరా !" వెంకట్రావు మురిసి పోయాడు.

"కాని బెస్ట్‌వర్కర్‌గా నీకున్న పేరు ముందు ఇదంతా దిగదుడుపేరా!" మానేజర్ అభినందించాడు.

చాయలు సేవించేప్పుడు అసలు విషయం ప్రాస్తావనకొచ్చింది. మానేజర్ యూనియన్ లీడర్లను పిలిపించాడు. ఇంటివద్ద జరిగిన సంగతంతా అందరిముందు చెప్పేసి "మావాడు చేసిన తప్పుకు నాకే సిగ్గుగా ఉంది" అన్నాడు వెంకట్రావు.

యూనియన్ లీడర్ల చేతులందుకుని "నాకు బుద్ధొచ్చింది. వర్కర్ల డబ్బులు లెక్కగట్టి ఇచ్చేస్తా. ఈసారిలాంటి తప్పు చెయ్యనుగాకచెయ్యను. నన్ను మన్నించండి." ప్రాధేయపడ్డాడు.

"రామచంద్రం" యూనియన్ లీడరందుకున్నాడు. "మానసికంగా శ్రమించినా, శారీరకంగా శ్రమించినా మనమంతా శ్రామికులం. మన ధ్యేయం ... ఐకమత్యం, దేశ సౌభాగ్యం."

"దీన్ని నేరముగా కాక తప్పుగా భావించి వదిలొయ్యండి సార్!" మరో లీడర్ మానేజర్ను బతిమాలాడు" తనయుడు చేసిన తప్పులకు తండ్రే శిక్షించాడు. చాలు ".

యూనియన్ లీడర్ల కోరిక మన్నించాడు మానేజర్.

**ఆకాశవాణి - హైద్రాబాదు, తేది : 22-6-1999**